# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 31 జులై, 2026 | పేజీలు : 08


## జిల్లాలో విస్తారంగా వర్షాలు..



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని చెరువులు, కుంటల్లోకి వరద నీరు వచ్చి చేరుతంది.వాగులు, ఒర్రెలు పొంగిపొర్లుతున్నాయి. లోయర్ మానేరు డ్యాం లోకి వరద వచ్చి చేరుతుంది గురువారం సాయంత్రం సాయంత్రం 6 గంటల వరకు 993 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు.కరీంనగర్ నగరంలో లోతట్టు ప్రాంతాలను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటి మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఆర్ఎఫ్ టీంకు సిద్దంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ నారాయణ పూర్ గ్రామంలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. పంపు హౌస్ నుండి ప్రతిరోజు 3150 క్యూసెక్కుల నీటిని వరద కాలువ ద్వారా కరీంనగర్ లోయర్ మానేర్ డ్యాం కు విడుదల చేస్తున్నారు.

## భారీవర్షం ... అన్నదాతల హర్షం

### వరద ఉధృతిని పరిశీలించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి* విద్యాసంస్థలకు సెలవు ప్రకటిటించిన కలెక్టర్





**ప్రజాపక్షం/జగిత్యాల :**జగిత్యాల జిల్లా వ్యాప్తంగా వరుసగా రెండవరోజు గురువారం తెల్లవారుజామునుంచే ఎడతెరపి లేకుండా అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఎల్‌నినో గండం గడించిందంటూ అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్‌తో పాటు అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు వర్షం నీటిలో కలకలలాడాయి. జగిత్యాలధర్మపురి ప్రధాన రహదారి జగిత్యాల రూరల్ మండలం అనంతారం బ్రిడ్జి, ధర్మపురి మండలం నెరెల్ల గ్రామ శివారులోని ఆకుసాయి పల్లి బ్రిడ్జిపై , సారంగాపూర్ మండలంలో బతుకమ్మ కుంట తెగిపోవడం, కోరుట్ల మండలం కల్లూరు వంతెనపై నుండి వర్షం నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ధర్మపురి వైపు నుంచి జగిత్యాల ప్రాంతానికి, కోరుట్ల నుంచి రాయికల్‌కు వచ్చే ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పలేదు. ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, భీర్‌పూర్, వెల్గటూర్, ఎండపల్లి మండలాల మీదుగా ప్రవహించే గోదావరి నది ఉదృతంగా ప్రవహించింది. గోదావరి నదితీరాన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్. ఎస్పీ అశోక్ కుమార్ తమ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రధాన చెరువులు, వంతెనల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, సారంగాపూర్ మండలంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, కమిషనర్ సత్య ప్రణవ్‌లు పర్యటించి వరద ఉధృతిని పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని అంగడి బజార్ ప్రాంతంలో విధ్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా షాక్ గురై గెదె మృతి చెందింది. జగిత్యాల కొండగట్టు ప్రధాన రహదారిపై భారి వృక్షం నెలకోరగంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి చెట్టును తొలగించి రాక పోకలను పునరుఃద్ధరించారు. సారంగాపూర్ మండలంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల పట్టణంలో ఐదుకు పైగా ఇండ్లు, 20కి పైగా చెట్లు కూలిపోవడంతో నాయకులు భాధిత కుటుంబాలను పరామర్శించారు. రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ సెలవు ప్రకటించారు. జిల్లాలో బీర్‌పూర్ మండలంలో 133.3 , సారంగపూర్ మండలంలో 100.03, ఎండపల్లి మండలంలో 100.02, వెల్గటూర్ మండలంలో 88.8 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదు అయ్యింది.

## నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం



### ఐడిఒసిలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఆర్డీ పాస్ బుక్ ల పంపిణీ

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, నేతన్నల సంక్షేమం కోసం మరిన్ని చర్యలుచేపడతామనితెలిపారు.

**నాణ్యమైన చీరల ఉత్పత్తి..**

సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు పని కల్పిస్తూ నాణ్యమైన చీరలు మహిళలకు అందిస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నేతన్న.. గీతన్న వేరు కాదని, జిల్లా నేతగా నేతన్న ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు.

**మహిళలు పండగలకు కార్యక్రమాలకు కట్టుకుంటున్నారు.. : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వేములవాడ కు వచ్చే భక్తులు, పర్యాటకులు సేదతీరేలా.. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా గుడి చెరువు బండ్ పార్క్ పనులను పూర్తి చేసి.. ప్రారంభించామని తెలిపారు. గత ఏడాది జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరలు చాలా నాణ్యతతో తయారు చేశారని గుర్తు చేశారు. వాటిని మహిళలు పండగలు, ఇతర కార్యక్రమాలకు కట్టుకుంటున్నారని వివరించారు. ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వాగుల వద్ద అప్రమత్తం

### ఫకీర్ కొండాపూర్ వాగును పరిశీలించిన కలెక్టర్,ఎస్‌పి

**ప్రజాపక్షం/జగిత్యాల/ఇబ్రహీంపట్నం :** భారీ వర్షాల నేపథ్యంలో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్–ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్,జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ గురువారం పరిశీలించారు.వాగులో నీటి ప్రవాహాన్ని పరిశీలించిన అధికారులు ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యమని పేర్కొంటూ అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.వాగులు,వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ప్రజలు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు.లోతట్టు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపట్టాలని,ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల్లో వెంటనే జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కోరారు.ఈ పరిశీలనలో మెట్‌పల్లి డీఎస్పీ రాములు,సి ఐ సురేష్ బాబు,తహసిల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో సిహెచ్ గణేష్, ఎంపీ ఓ రామకృష్ణ రాజు,స్థానిక ఎస్సై జి. నవీన్ కుమార్,ఆయా గ్రామాల సర్పంచులు కనుక నాగేష్, తోట రమేష్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రానైట్ క్వారీలో బాల కార్మికుల గుర్తింపు

**ప్రజాపక్షం/శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ 12లో భాగంగా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో బాల కార్మికులను గుర్తించారు.వివరాల్లోకెళ్తే హుజూరాబాద్ (ఎఫ్ఎసి) అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ గుండాటి చక్రధర్ రెడ్డి తన బృందంతో కలిసి గురువారం తనిఖిలు నిర్వహించారు.తనిఖీల్లో భాగంగా కొత్తగట్టు గ్రామంలోని కెవికె గ్రానైట్ పరిశ్రమలో స్టోన్ కటింగ్,డ్రిలింగ్ పనుల్లో పనిచేస్తున్న 18 సంవత్సరాలు నిండని ముగ్గురు బాల కార్మికులు పనిచేయడం గమనించారు.దీంతో బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వ్యక్తితో పాటు సంబంధిత గ్రానైట్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించారు.

## పూరిగుడిసెలోకి చేరిన వరద నీరు

**ప్రజాపక్షం/ముత్తారం :** రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామ పరిధిలోని అమరాబాద్ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొం ది. గ్రామానికి చెందిన మేకల కోమలత అనే పేద గిరిజన మహిళకు చెందిన పూరిగుడిసెలోకి వర్షపు నీరు భారీగా వచ్చి చేరింది.ఈ హఠాత్ పరిణామంతో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులన్నీ పూర్తిగా నానిపోయి వంట వండుకోవడానికి కూడా వీల్లేకుండా పోయి ం ది. దీనికితోడు,వరి పంట పొలానికి ఇం ట్లో నిల్వ ఉంచుకున్న ఎరువుల బస్తాలు సైత ం నీట మునిగి పూర్తిగా తడిసిపోయాయి. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన తమను ప్రభుత్వపరంగా తక్షణ ఆర్థిక సహాయం అందించి,ఆదుకోవాలని వారు అధికారులను,ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.

## 'సింగరేణి' అక్రమ నిర్మాణాల కూల్చివేత

**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖని తిలక్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న సింగరేణ ఆర్‌జి 1 ఏరియా స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను గురువారం సింగరేణి స్పెషల్ స్క్వాడ్ బృందం పర్యవేక్షణలో అధికారులు కూల్చివేశారు. ముందస్తు అనుమతి లేకుండా సింగరేణి స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడ్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులుహెచ్చరించారు.సింగరేణిభూములపరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం / గన్నేరువరం :** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గన్నేరువరం ఎస్సై జి.నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ అవసరం లేకుండా ప్రజలు బయటకు వెళ్లకూడదని వీలైనంతవరకు ఇండ్లలోనే ఉండాలని సూచించారు. పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ వారిని ఒక కంటి కనిపెడుతూ ఉండాలని అన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

## ఎల్లంపల్లికి, కాళేశ్వరానికి తేడా తెలియని మూర్ఖులు బిఆర్ఎస్ నాయకులు

### మండల కాంగ్రెస్అధ్యక్షుడు మంత్రి మహేందర్

**ప్రజాపక్షం / గంగాధర :** ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కాళేశ్వరం ప్రాజెక్టుకు తేడా తెలియని మూర్ఖులు బిఆర్ఎస్ నాయకులని మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంత్రి మహేందర్ ఆరోపించారు. గంగాధరలోని ప్రజా కార్యాలయంలో గురువారం మంత్రి మహేందర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో ముఖ్యమంత్రిగా పని చేసిన వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూలై 28, 2004లో ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని తుమ్మిడిహట్టి వద్ద బ్యారెజీ నిర్మాణం చేసి విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా నీటిని తలరించాలని ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకముందే ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా చొప్పదండి నియోజకవర్గానికి 2016లో చొప్పదండి వరప్రదాయినిగా పేరు గాంచిన గంగాధర నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఇదే బిఆర్ఎస్ నాయకులు నీటిని తరలించిన సంగతి గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభిచక ముందే 6 సార్లు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించిన సంగతి మరిచిపోయారా అని విమర్శించారు. కొండగట్టు అంజన్న ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సంతోషంగా ఉండాలని కోరుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొండగట్టు గిరి ప్రదక్షిణకు 24 గంటల ముందే వానదేవుడు కరుణించి వర్షం కురిపించాడని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గిరి ప్రదక్షిణ చేసి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ న్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, రైతులు, అభిమానులు, భక్తులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దుబ్బాసి బుచ్చన్న, మండల మహిళా కాంగ్రెస్ నాయకులు చిరుత మంగ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు ముద్దం గణేశ్, సర్పంచులు ,నాయకులు పాల్గొన్నారు.

## కేజీ వీల్స్ తో రోడ్డుపై తిరిగితే కఠిన చర్యలు

### ఎలిగేడు సబ్ ఇన్స్పెక్టర్ మధుకర్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** కేజీ వీల్స్ ట్రాక్టర్స్ తో రోడ్డుపై తిరిగి రోడ్డు ధ్వంసానికి కారణం అయితే కఠిన చర్యలు తప్పవని ఎలిగేడు సబ్ ఇన్స్పెక్టర్ మధుకర్ అన్నారు.ఎలిగేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రోడ్లు, భవనాల (ఆర్&బి) ప్రధాన రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా కేజ్ వీల్స్ (ఇనుప చక్రాలు) తో నడుపుతున్న ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, తగిన చర్యల నిమిత్తం తహశీల్దార్ మరియు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కు అప్పగించినట్లు ఎలిగేడు సబ్ ఇన్స్‌పెక్టర్ మధుకర్ తెలిపారు. సబ్ ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాలు ప్రకారం మహమ్మద్ ఇమ్రోజ్ స్థానిక పెట్రోలింగ్ విధుల్లో ఉండగా ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో R&B రహదారిపై ఒక ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో ప్రయాణిస్తున్నట్లు గమనించారు.రహదారులను దెబ్బతీసే విధంగా కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్ నడుపుతున్న సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని డ్రైవర్



కీర్తి రాజేషం ట్రాక్టర్ (టిఎస్04 ఇఎఫ్ 2186) ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. రోడ్డు ధ్వంసంనికి కారణమవుతున్న ఇలాంటి వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ & తహశీల్దార్, ఎలిగేడు కు నివేదిక సమర్పించినట్లు ఎస్ఐ తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారులపై కేజ్ వీల్స్ (ఇనుప చక్రాలు) తో ట్రాక్టర్లు లేదా ఇతర వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, జిల్లాలోనూ వర్షాలు ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినందున జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పాత, శిథిలావస్థలో ఉన్న భవనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట్ల జేసీబీలు, రెస్క్యూ వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు. వదులుగా ఉన్న విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏఈలతో సమన్వయం చేసుకుని నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 8782997247ను ప్రజలకు, ప్రజాప్రతినిధులకు విస్తృతంగా తెలియజేయాలి. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఈ నంబర్‌కు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్యాధికారులు, డిప్యూటీ డీఎంహెచ్‌వోతో సమన్వయం చేసుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. రహదారులకు జరిగిన నష్టంపై పంచాయతీరాజ్ అధికారులు వెంటనే నివేదిక అందించాలని తెలిపారు. ఆర్ అండ్‌బీ రహదారులు, కల్వర్టులు, వంతెనలు ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టంపై రోడ్లు భవనాల శాఖ అధికారులు నివేదిక సమర్పించాలని అన్నారు. పంట నష్టాలను నమోదు చేయాలని, అలాగే పశుసంవర్ధక శాఖ సిబ్బందితో కలిసి అవసరమైన చోట పశువుల రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## మానవత్వానికి మరో నిదర్శనం సుల్తానబాద్ చైర్మన్ కౌన్సిలర్లు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** మానవత్వానికి మరో నిదర్శనం సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు.వృద్ధదంపతుల వేదనను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న కొడుకులే ఆదరించకపోవడంతో సుల్తానాబాద్‌కు చెందిన కలవాల లక్ష్మి రాజయ్య దంపతులు పడుతున్న వేదన వర్ణనాతీతం. కొడుకులు చేరదీయక దీనావస్థలో ఉన్న ఆ వృద్ధ దంపతులకు, ఇటీవల కురుస్తున్న వర్షాలు మరింత శాపంగా మారాయి. వారు ఉంటున్న ఇల్లు పూర్తిగా శిథిలమై, ఎప్పుడు కూలుతుందో తెలియని ప్రమాదకర స్థితిలో బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్నారు. కన్నవారే కన్నీరు పెట్టిస్తున్న ఈ దుస్థితిని చూసి మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, వార్డు కౌన్సిలర్లు గాజుల రాజమల్లయ్య, వరప్రదీప్, పద్మ అబ్బయ్య గౌడ్, శంకరమ్మ ఓదెలు, యువ నాయకులు గాజుల హరీష్ చలించిపోయారు. తమ వాళ్లే ఆదుకోని చోట మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు.. ఆ వృద్ధ దంపతులకు నిజమైన బిడ్డల్లా అండగా నిలిచారు. స్వయంగా వారిని చేరదీసి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో సురక్షితంగా చేర్చి, ఆపదలో ఉన్న వారికి మేమున్నామంటూ ముందుకు వచ్చిన ఈ నాయకుల మానవతా దృక్పథాన్ని స్థానికులు అభినందిస్తున్నారు.

## గంజాయి కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

**ప్రజాపక్షం /పెగడపల్లి :** గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ జగిత్యాల 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి జి. సునీత రవీందర్ రెడ్డి గురువారం తీర్పు వెలువరించారు.నిందితులు మెస్రం నాగేష్, పెందూర్ లక్ష్మ ణ్ లకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. పెగడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 70/2024, ఎస్‌సి ఎన్‌డిపిఎస్ 9/2024 కేసులో ఎన్‌డిపిఎస్ ఆక్ట్–1985 సెక్షన్ 20(b)(1) కింద విచారణ జరిగింది.ఆదిలాబాద్‌కు చెందిన మెస్రం నాగేష్, పెందూర్ లక్ష్మ ణ్‌లను న్యాయస్థానం దోషులుగా నిర్ధారించింది.ఈ కేసులో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా సీఐ నీలం రవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బిట్ల నర్సయ్య వ్యవహరించారు. లైజన్ పీసీగా బి. రాజు,ఎం. హరీష్ సహకరించారు.ఎస్ఐ సిఎంఎస్ టీమ్ వివరాలు వెల్లడించారు.

## వంట కార్మికులకు,స్కావెంజర్లకు చీరల పంపిణీ

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిధిలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన గుంటి రాజయ్య రిటైర్డ్ హెడ్మాస్టర్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థము మండలంలో పనిచేస్తున్న 105 మంది మధ్యాహ్న వంట కార్మికులకు,స్కావెంజర్లకు గురువారం మండల విద్యాధికారి లక్ష్మి నారాయణ చేతుల మీదుగా చీరలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి పాఠశాల కమిటి చైర్మెన్ జరీనా,సామాజిక కార్యకర్త గంగిశెట్టి జగద్వీర్,ఉపాధ్యాయ బృదం విద్యార్థులు వంట కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ పంప్ హౌజ్ నీళ్లు విడుదల

**ప్రజాపక్షం / రామడుగు:** సకాలంలో వర్షాలు కురువకపోవడంతో రైతన్నల ఇబ్బంది దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు గాయత్రీ పంప్ హౌజ్ ఇంజనీరింగ్ అధికారులు ఎట్టకేలకు బుధవారం రాత్రి నీళ్లు విడుదల చేశారు. పంప్ హౌజ్ నుంచి ప్రతిరోజు 3150 క్యూసెక్కుల నీటిని వరద కాలువ ద్వారా కరీంనగర్ డ్యాంకు విడుదల చేయనున్నట్లు తెలిపారు. వరి నాట్లకు సిద్ధంగా ఉన్న రైతులు పంప్ హౌజ్ నుంచి ఇంజనీరింగ్ అధికారులు నీటిని విడుదల చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ ముమ్మురంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు సర్పంచులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## 'అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ టెండర్‌లో రూ.180 కోట్ల గోల్‌మాల్'

### మాజీ మేయర్ సర్ధార్ రవీందర్ సింగ్ ఆరోపణ

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరంలో రూ.180 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల టెండర్ ప్రక్రియపై మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్ధార్ రవీందర్ సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ టెండర్ వ్యవహారంలో రూ.40–50 కోట్ల వరకు చేతులు మారాయనే అనుమానాలు ఉన్నాయని, కేవలం కమీషన్ల కోసమే కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయని ఆయన ఆరోపించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సర్ధార్ రవీందర్ సింగ్ మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం ప్రభుత్వం జివో 745 ద్వారా రూ.180 కోట్ల నిధులు కేటాయించిందని, ఇంత భారీ మొత్తంలో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు టెండర్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ఉండాల్సిన అవసరముందన్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఎక్సెస్ టెండర్‌ను రద్దు చేసి.. మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడంలో ఆంతర్యమేంటని సర్ధార్ రవీందర్ సింగ్ ప్రశ్నించారు. ఎక్సెస్ టెండర్‌ను రద్దు చేయడానికి బలమైన కారణం ఉండాలని, నిబంధనల ప్రకారం తగిన అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. కేవలం 5 శాతం ఎక్సెస్ పేరుతో టెండర్ ప్రక్రియను మార్చి, తిరిగి అదే కాంట్రాక్టర్‌కు పనులు కట్టబెట్టడం వెనుక అసలు కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రూ.50 లక్షల పనులకు ఒక నిబంధన.. రూ.180 కోట్ల పనులకు మరో నిబంధనా? అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల రూ.50 లక్షల విలువైన పనుల్లో ఎక్సెస్ కారణంగా జిల్లా కలెక్టర్ టెండర్‌ను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అదే నిబంధన భారీ విలువైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ టెండర్‌కు ఎందుకు వర్తించదని నిలదీశారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికుందని, టెండర్‌లో ఎలాంటి లావాదేవీలు జరగకపోతే పూర్తి వివరాలను బహిర్గతం చేయాలన్నారు.

**గతంలో చేసిన పనులపై విచారణ లేకుండానే మళ్లీ అదే సంస్థకు పనులా?**

గతంలో స్మార్ట్ సిటీ కింద చేపట్టిన పనులను పూర్తి స్థాయిలో పరిశీలించకుండా మళ్లీ అదే కాంట్రాక్టర్‌కు భారీ విలువైన పనులు అప్పగించడం ఏమిటని సర్ధార్ రవీందర్ సింగ్ ప్రశ్నించారు. నగరంలో జరుగుతున్న టెండర్ వ్యవహారాలపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య కుమ్మక్కయ్యారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని సర్ధార్ రవీందర్ సింగ్ అన్నారు.

# ప్రణాళికాబద్ధంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు

## ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది

**ప్రజా పక్షం/వేములవాడ:** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వరుణ యాగ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి, విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2023–24లో 50 కోట్లు, 2024–25లో 100 కోట్లు కేటాయించగా, అనంతరం మరో 99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 45 శాతం పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో పూర్తి స్థాయిలో పనులు ముగించి, రాబోయే వెయ్యేళ్ల అవసరాలకు అనుగుణంగా రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తుల సూచనలు, సలహాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు 12 కోట్లతో వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ లో ఆధునిక పార్కు, భారీ శివుడి విగ్రహం, మొక్కలు, నటరాజ విగ్రహం పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే 10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు, 47 కోట్లతో వేములవాడలో 80 అడుగుల రహదారి విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వేములవాడ డిపోకు 20 కొత్త బస్సులు కేటాయించడం, అలాగే 1.60 కోట్లతో తిప్పాపూర్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ప్రజలకు ఎంతోఉపయోగపడుతుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# నాణ్యతకు మారుపేరు సెల్ టైగర్ రూఫింగ్ షీట్స్

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** నాణ్యతకు మారుపేరు సెల్ టైగర్ రూఫింగ్ షీట్స్ అని సెల్ టైగర్ ప్రతినిధులు అన్నారు. గురువారం నాణ్యమైన రూఫింగ్ షీట్స్ తయారీలో ప్రత్యేక గుర్తింపు పొందిన సెల్ టైగర్ కంపెనీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని స్వయం హోటరల్‌లో ఫాబ్రికేటర్ల కోసం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని పలువురు ఫాబ్రికేటర్లు, నిర్మాణ రంగ నిపుణులు, వ్యాపారులు హాజరై మాట్లాడుతూ సెల్ టైగర్ రూఫింగ్ షీట్స్ అధిక నాణ్యత గల ముడి పదార్థాలతో తయారవుతున్నాయని దీర్ఘకాలం మన్నిక, వర్షాలు, ఎండ వంటి వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉన్నాయని వివరించారు. రూఫింగ్ షీట్స్ ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సరైన మందం, కోటింగ్ నాణ్యత, ఫిట్టింగ్ పద్ధతులు భద్రతా ప్రమాణాలపై ఫాబ్రికేటర్లకు సాంకేతిక అవగాహన కల్పించారు. నిర్మాణ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో మంచి ఉత్పత్తులను వినియోగించడం ద్వారా వినియోగదారుల విశ్వాసాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న ఫాబ్రికేటర్లు కంపెనీ ఉత్పత్తుల లక్షణాలపై సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్మాణ రంగానికి ఉపయోగంగా ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సెల్ టైగర్ కంపెనీ ప్రొప్రైటర్ దావ తిరుపతి, తెలంగాణ ఏరియా మేనేజర్ రాహుల్ పబ్బు, వరంగల్ క్లస్టర్ ఆఫీసర్ గణేశ్, వెల్డింగ్ యూనియన్ అధ్యక్షులు నాంపల్లి శ్రీనివాస్, డీలర్లు, ఫాబ్రికేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట పట్టణ పరిధిలోని 4వ వార్డులో ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా వరద నీటి సజావుగా వెళ్లేందుకు గాను శానిటేషన్ టీమ్ వర్క్ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పట్టణ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అవసరంఉంటేతప్పబయటకు రాకూడదనిజాగ్రత్తలు పాటించాలని అన్నా రు.

# ప్రాంగణానికి మొరమే దొరకలేదా..!!

## బస్టాండ్ ఆవరణ అస్తవ్యస్తం



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** ఎల్లారెడ్డిపేట బస్టాండ్ ప్రాంగణానికి ఇరుపక్కల ఇటీవల ట్రాక్టర్ బ్లేడ్ సహాయంతో వెనకాలే ఉన్న పనికిరాని మట్టి పోయడంతో ప్రయాణికులు తీవ్ర అసహనంతో ఉన్నారు.ప్రాంగణంలోకి వెళ్ళే మలుపుతో సిమెంట్ రోడ్డు చిన్నాభిన్నం కావడంతో చిత్తడిగా మారి బురదమయంగా తయారైంది.బస్సు ఎక్కుదామంటే బురదమట్టి అంటిఎక్కల్సిందేనని అంటున్నారు.ఎందుకు ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు తీవ్ర ఆగ్రహానికి లోనగుతున్నారు.కనీసం మోరం మట్టి దొరకడం లేదా అని అసహనానికి లోనగుతున్నారు. ప్రజలకు కనీసం సీసీ రోడ్డు వేయకున్నా కనీసం మొరంతో కూడిన మట్టి వేస్తే బురదమయం కాకుండా ఉండేదని చెబుతున్నారు.ఇదెంతవరకు చోద్యమని ప్రయాణీకుల ఇక్కట్లు అధికారులు పట్టించుకున్న తీరు కనబడటం లేదని వాపోతున్నారు.బస్టాండ్ ప్రాంగణంలో మూత్రశాలలు సరిగా ఉండటం లేదని,ఆడపిల్లలకు,విద్యార్థులకు,ప్రయాణికులు సమస్యలతో సతమతం అవ్వాల్సిందేనని అంటున్నారు.ఇకనైన అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. పలువురు రవాణా శాఖ మంత్రికి వినతిపత్రం అందిస్తామని ఎల్లారెడ్డిపేట వాస్తవ్యులు తెలుపుతున్నారు.

# వ్యాసరచన పోటీల్లో పారమిత విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డీర్ పార్క్‌లో జీవ వైవిధ్యంలో పులుల పాత్ర అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాల్గొన్న పారమితి విద్యార్థులు ప్రథమ బహుమతులను కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీకర్ తెలిపారు. 9వ తరగతి విద్యార్థి చింతల శ్రీనిధి ప్రథమ బహుమతి, 8 వ తరగతి విద్యార్థి తుమ్మ శ్రీ శాన్వీ ప్రథమ బహుమతి, 7వ తరగతి విద్యార్థి పొలుసాని యశస్వి లు ప్రథమ బహుమతులు సాధించి తమ ప్రతిభను చాటారని పేర్కొన్నారు. పులుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతలో పులుల ప్రాధాన్యత వంటి అంశాలను విద్యార్థులు తమ వ్యాసాల్లో సమగ్రంగా వివరించి న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకున్నారని అన్నారు. పోటీలకు ముఖ్య అతిథులుగా డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్.సత్యనారాయణ, కరీంనగర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ షౌకత్ హుస్సేన్ హాజరై విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ పుస్తకాల్లోని విజ్ఞానంతో పాటు ప్రకృతిని ప్రేమించడం పర్యావరణాన్ని కాపాడడం కూడా మన బాధ్యత అని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, వియుయం ప్రసాద్, సమన్వయకర్త దీప్తి రాణి, ఉపాధ్యాయ బృందం ,కరీంనగర్ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# దాసరి మనోహర్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు తగవు

## బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** నియోజకవర్గంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ధర్నా నిర్వహిస్తే మింగుడుపడని కాంగ్రెస్ నాయకులు ఆయనపై వ్యక్తిగత దూషణలు చేయడం సరికాదని బిఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు.ఈ మేరకు స్థానిక జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతుల కోసం సాగునీరు అందేలా చూడాలని,అంతరాయాలు లేకుండా నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలని, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచి అధిక ధరలకు విక్రయించకుండా నియంత్రించాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే ఆయనపై అసత్యపచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కపిపుచ్చుకొని రైతులకు సమాధానం చెప్పలేక సంబంధం లేని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రస్తావిస్తే రాజకీయ కోణంలో చూడటం సరైన విధానం కాదన్నారు.మనోహర్ రెడ్డి ఎమ్మెల్యేగా పదేళ్లలో 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును అందించారని, సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచారని, రైతులు పంట ఉత్పత్తులను తమ గ్రామంలోనే విక్రయించుకునేలా గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. రైతు పెట్టుబడి సహాయం, రైతు బీమా సకాలంలో అందించాడన్నారు.విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి,మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మోహన్ రావు,మండల అధ్యక్షులు మార్కు లక్ష్మ ణ్, బైరం రామ్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సందీప్ రావు, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్,నాయకులు గుణపతి,మోబిన్ ,కాశిపాక వాసు,ముఖీమ్, సదయ్య,రఫీక్,పల్లె మధు, తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మెర ధర్మారెడ్డికి అశ్రునివాళి

**ప్రజాపక్షం / గన్నేరువరం :** గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొమ్మెర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి తండ్రి కొమ్మెర ధర్మారెడ్డి గురువారం కన్ను మూశారు. ఆయన అంత్యక్రియలకు భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా బంధుమిత్రులు, గ్రామస్థులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కన్నీటి వీడ్కోలు పలికారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ధర్మారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించి రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్మారెడ్డికి ఘనంగా తుది వీడ్కోలు పలికారు.

# అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దు : ఎస్ఐ



**ప్రజాపక్షం / గంగాధర :** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని గంగాధర ఎస్సై బి.వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గంగాధర మండల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, చెరువులు, కల్వర్టులు, నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాలను దాటేందుకు ప్రయత్నించవద్దని చిన్న పిల్లలను నీటి ప్రాంతాలకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు , నీటిలో మునిగిని విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలని అన్నారు. ఏదైనా అత్యవసమైతే సహాయం కోసం పోలీస్ శాఖ లేదా సంబంధిత అత్యవసర సేవలకు సమాచారం ఇవ్వాలన్నారు. సహాయం కోసం 8712670768, 112 నంబర్‌లకు కాల్ చేయాలని కోరారు.

# అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్&బీ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, భవనాలు, రహదారులు, లో లెవెల్ కల్వర్టులు తదితర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని తెలిపారు.లో లెవెల్ కల్వర్టులు, వాగులు, వంతెనలు, రహదారులపై నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రజలు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎక్కడైనా వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ లేదా పంట నష్టం సంభవిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.చెరువులు, కుంటలు, వంతెనలు, కాలువలు, లోతట్టు ప్రాంతాల వద్ద నీటి ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కలెక్టర్ తెలిపారు.

**కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వరదలు, నష్టాల వివరాలపై సమాచారం అందించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 9398684240 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జెడ్పీ సిఇఒ, సిపిఒ శ్రీనివాస చారి, డిఆర్‌డిఒ లక్ష్మి నారాయణ, డిపిఒజయశీల, ఎన్‌పిడిసిఎల్ ఎస్ఇ, పంచాయితీ రాజ్ ఇఇసుదర్శన్, తదితరులు ఉన్నారు.

# మొలంగూర్ ఖిల్లాను సందర్శించిన డిఆర్‌డిఒ

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మం డలంలోని మొలంగూర్ ఖిల్లాను గురువారం కరీంనగర్ డిఆర్‌డిఓ గీత సందర్శించారు.పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోనున్న మొలంగూర్ ఖిల్లాను డిఆర్‌డిఓ సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకొనుంది.మొలంగూర్ ఖిల్లా వైభవం ప్రాముఖ్యత గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు.తానే స్వయంగా దూద్‌బావి నీటిని తోడి సేవించారు.దూద్‌బావి నీటిని పూర్వకాలంలో గుర్రపు బండిలపైహైదరాబాద్‌కు తరలించేవారని స్థానికులు డిఆర్‌డిఓకు వివరించారు.చినుకులు పడడంతో మొలంగూర్ ఖిల్లా వద్ద టీ సేవించి వివరాలు తెలుసుకున్నారు.డిఆర్‌డిఓ వెంట ఎస్‌బీఎం కరుణాకర్,కోఆర్డినేటర్‌లున్నారు.

## రహదారిపై చెట్టు తొలగింపు: ట్రాఫిక్ పునరుద్ధరణ

**ప్రజాపక్షం/హాజీపూర్ :** మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల గ్రామంలో 63వ జాతీయ రహదారిపై గురువారం ఉదయం భారీ చెట్టు విరిగిపడింది. వర్షాల కారణంగా రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే హాజీపూర్ ఎస్ఐ కిరణ్ తన సిబ్బందితో కలిసి వెంటనే అక్కడకు చేరుకున్నారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. సమయానుకూలంగా స్పందించి రహదారిని బాగు చేసిన హాజీపూర్ ఎస్ఐ కిరణ్, పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బందిని స్థానికులు, వాహనదారులు అభినందించారు.

## గంగా వద్ద పెరుగుతున్న వరద ప్రవాహం

**ప్రజాపక్షం/కౌటాల :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో కౌటాల మండలంలోని తాటిపల్లి గంగా వద్ద నీటిమట్టం పెరిగి వరద ఉధృతంగా ప్రవహిస్తోం ది. వరద తీవ్రత పెరుగుతుండటంతో నదిలో పడవల ప్రయాణాన్ని నిలిపివేసి, వాటిని ఒ డ్డు న భద్రపరిచారు. ప్రమాదాలు జరగకు ండా ఉ ండేందుకు నది పరివాహక ప్రాం తాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. అవసరం లేకుండా ఎవరూ నది వ ద్దకు వెళ్లకూడదని సూచించారు. ఈ పరిస్థితిని స్థానిక అధికారులు, పంచాయతీ సిబ్బంది నిర ంతరం పర్యవేక్షిస్తున్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/రెబ్బన :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రెబ్బన ఎస్ఐ వెంకటకృష్ణ సూచించారు. ప్రజలు ఎవరూ చెరువులు, కాలువలు, వాగుల వద్దకు వెళ్లకూడదని తెలిపారు. పిల్లలు బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కోరారు. రైతులు, పశువుల కాపరులు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆపద సమయంలో అత్యవసర సహాయం కోసం ప్రజలు డయల్ 100 నంబరును సంప్రదించాలని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

## వంతెన వద్ద వరదలో చిక్కుకున్న బొలెరో

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** కొండపల్లి–గొల్లగూడెం గ్రామాలను కలిపే ప్రధాన రహదారిపై నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద గురువారం కురిసిన భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న వరదను దాటేందుకు ప్రయత్నించిన ఒక బొలెరో వాహనం ఇరుక్కుపోయింది. గ మనించిన స్థానికులు వెంటనే స్పందించి జే సీ బీ సహాయంతో వాహనాన్ని సురక్షితంగా బ యటకు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ కార్యక్రమంలో సహాయక చర్యల్లో పాల్గొన్న స్థానికులు ఉన్నారు.

## వార్ధ నది ఉప్పొంగుతోంది.. అప్రమత్తంగా ఉండాలి

సిఐ సంతోష్



**ప్రజాపక్షం/సిర్పూర్ (టి) :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సిర్పూర్ (టి) మండలం నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు ప్రవహించే వార్ధ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌటాల సిఐ సంతోష్ సూచించారు. వార్ధ నదిలో నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ నదిలోకి దిగకూడదని, చేపల వేట, ఈత, నాటు పడవల ప్రయాణాలను పూర్తిగా నిలిపివేయాలని హెచ్చరించారు. వాగులు, కాలువలు, లోలెవెల్ బ్రిడ్జిలను దాటే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని, పాత ఇళ్లలో నివసించే వారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే 100 నంబరుకు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా చేపల వేటపై నిషేధం

**ప్రజాపక్షం/నస్పూర్:** రాగల రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గోదావరి నదీ పరివాహక ప్రాంతంతో పాటు చెరువులు, వాగులు, కాలువల్లో చేపల వేటపై నిషేధం విధించినట్లు మంచిర్యాల జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్. అవినాష్ తెలిపారు. మత్స్యకారులు ఎవరూ చేపల వేటకు వెళ్లకూడదని, అప్రమత్తంగా ఉండాలని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు. సరదాగా ఈత కొట్టడానికి కూడా నీటి వనరుల వద్దకు వెళ్లరాదని సూచించారు. చెరువులు, కుంటల వద్ద చేపల కోసం అమర్చిన జాలీలు, వలలను తక్షణమే తొలగించాలని, ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తే మత్స్యకారుల లైసెన్సులు, సొసైటీల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీల పరిధిలో టామ్ టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతాలు, రిజర్వాయర్లలో చేపల వేట నిషేధ నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు.

## శాస్త్ర విజ్ఞానంలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి



అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ టౌన్ :** విద్యార్థులలో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి ఆవిష్కరణల రంగాలలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్స్పైర్ మానక్ అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ఇన్స్పైర్ – మానక్ లో కనీసం 5 ఉత్తమ ఆవిష్కరణలను ఆగస్టు 20 నాటికి 100 శాతం నమోదు చేయించాలని ఆదేశించారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2026 లో భాగంగా స్థానిక సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రాజెక్టులను రూపొందించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏక్ పేడ్ మా కే నామ్–2026 కింద ప్రతి విద్యార్థి తమ తల్లి పేరిట ఒక మొక్క నాటాలని, ప్రతి పాఠశాలలో ఒకరిని గ్రీన్ టీచర్‌గా నియమించాలని తెలిపారు. ఈకో క్లబ్ ఆన్‌లైన్ పోటీలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు 100 శాతం పాల్గొనేలా చూడాలని ప్రధానోపాధ్యాయులు, విద్యాధికారులకు మార్గదర్శకాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై క్యాతనపల్లి మున్సిపాలిటీ అప్రమత్తం

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** భారీ వర్షాల నేపథ్యంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ అధికారులు సూచించారు. సెల్లార్లలో విద్యుత్ మీటర్లు, వైరింగ్ ఉన్న భవనాల యజమానులు వాటిని గ్రౌండ్ ఫ్లోర్ లేదా మొదటి అంతస్తుకు మార్చుకోవాలని తెలిపారు. సెల్లార్లలోకి నీరు చేరకముందే వాటర్ మోటార్లతో బయటకు పంపించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోని వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, బాధితుల కోసం ఠాగూర్ స్టేడియం యోగా హాల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రజల సహాయార్థం 24 గంటల కంట్రోల్ రూం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద నిలబడవద్దని హెచ్చరించారు. మాంసం, చేపల దుకాణదారులు పరిశుభ్రత పాటిస్తూ ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ చట్టం–2019 ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పొంగి ప్రవహిస్తున్న ఉచ్చమల్ల, బొక్కి వాగులు



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఉచ్చమల్ల, బొక్కి, పెద్ద వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాగుల నీరు పంట పొలాల్లోకి చేరి వ్యవసాయ భూములు జలమయమయ్యాయి. 12 గ్రామ పంచాయతీల పరిధిలోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి మత్తడి పోస్తున్నాయి. ఈ నేపథ్యంలో తహసీల్దార్ రవీందర్, ఎస్ఐ అనిల్ కుమార్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఉచ్చమల్ల వాగు మత్తడి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నీటి ఉధృతి ఉన్నందున ప్రజలు వాగులు, మత్తడులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకూడదని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనివ్వకూడదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితి ఉంటే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యటన

**ప్రజాపక్షం/నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. తర్నం జాతీయ రహదారి353బితో పాటు తలమడుగు, ఇచ్చోడ, నేరడిగొండ మండలాల్లో పర్యటించి వాగులు, ప్రాజెక్టులు, కుంటాల జలపాతం వద్ద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రతే తమకు ముఖ్యమని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఉప్పొంగే వాగులు, కల్వర్టులను దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అత్యవసర సహాయం కోసం 24/7 డిడిఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉందన్నారు. ప్రమాద సమయంలో డయల్100కి సమాచారం అందించాలని కోరారు. పర్యటనలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వరద తీవ్రతను పర్యవేక్షించిన సరండి సర్పంచ్ బాపూజీ

**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని సరండి గ్రామపంచాయతీ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వంతెనలపై వరద నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలగడంతో సరండి సర్పంచ్ ముహూర్లే బాపూజీ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. వంతెనల వద్ద ప్రమాదాలు జరగకుండా వాహనదారులు, ప్రజల రాకపోకలను నియంత్రించారు. ప్రజల ప్రాణ భద్రతే తమకు ముఖ్యమని, వర్షాలు తగ్గే వరకు అప్రమత్తంగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని, పిల్లలను వాగుల వద్దకు వెళ్లనివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జాడే సోనామ్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వర్షానికి తెగిన విద్యుత్ తీగల పునరుద్ధరణ

**ప్రజాపక్షం/కౌటాల :** భారీ వర్షం కారణంగా కౌటాల మండలంలోని తాటినగర్ గ్రామంలో విద్యుత్ వైర్ తెగిపోయి సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న సర్పంచ్ కత్కర్ మౌనిక అనిల్, ఉప సర్పంచ్ సజన్ వెంటనే స్పందించి విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వేగంగా స్పందించి విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేసిన సర్పంచ్, ఉప సర్పంచ్, విద్యుత్ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, విద్యుత్ శాఖ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన జైనూర్ సర్పంచ్ ప్రకాష్

**ప్రజాపక్షం/జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలో కురిసిన భారీ వర్షానికి శివాజీ నగర్‌లోని మైనోద్దీన్ ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయం తెలిసిన వెంటనే జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్ వర్షంలోనే కాలినడకన మైనోద్దీన్ ఇంటికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గ్రామపంచాయతీ సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టి, ఇంట్లోకి చేరిన నీటిని తొలగించి బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించారు. కష్టకాలంలో వెంటనే స్పందించి ఆదుకున్న సర్పంచ్ సేవాభావాన్ని స్థానిక గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప స ర్పంచ్ డొంగ్రే ప్రకాష్, నాయకులు అబ్బుతాలిబ్, రమేష్ సెట్, మాజీ జడ్పిటిసి విశ్వంబార్, మాజీ ఎంపిటిసి రఫిక్, అమృత్ పాల్గొన్నారు.

## వర్షాలతో కళకళలాడుతున్న నాగమ్మ చెరువు

**ప్రజాపక్షం/సిర్పూర్ (టి) :** గత రెండు రోజులుగా సిర్పూర్ (టి) మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ (నాగమ్మ చెరువు) నీటితో నిండిపోయింది. చెరువులోకి భారీగా వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకుని స్థానికులను ఆకట్టుకుంటోంది. ఇటీవల వరకు నీటి కొరతతో వెలవెలబోయిన నాగమ్మ చెరువు ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. చెరువు నిండటంతో రైతులు, స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వర్ష ప్రభావం ప్రాంతాల పరిశీలన

**ప్రజాపక్షం/బోథ్ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు దృశ్య బోథ్ ఎస్ఐ పురుషోత్తం, ఎంపిడిఓ ఎల్.రమేష్ ,ఎంపిఒ రాజ్ కుమార్ ధన్నురు, కుచిర్యాల, మండ బోగడ, బోథ్ సాయినగర్ గ్రామాలలో సందర్శించి పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో కాకుండా అవసరమైతే ప్రభుత్వ భవనాలలో తాత్కాలికంగా నివసించాలని ప్రజలకు సూచించడం జరిగింది.వారి వెంట ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు అశోక్,షకీల్, జిపిఒ ముత్యం,పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## పల్కేరు వాగులో నీటి కుక్కలు

**ప్రజాపక్షం/పెంబి :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నిర్మల్ జిల్లా పెంబి లోని మందపల్లి వద్ద పల్కేరు వాగు ఉప్పొంగింది.వరద ప్రవాహంలో నీటి కుక్కలు కొట్టుకొచ్చాయి. వాగు ప్రవాహంలో ఈదుతూ కనిపించిన నీటి కుక్కలను స్థానికులు ఆసక్తిగా వీక్షించారు.కొందరు వాటి దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. వరద ఉధృతి కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి నీటి కుక్కలు ప్రవాహంలో కొట్టుకొచ్చి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నా రు.

## ఆపద సమయంలో అండగా ఉంటా

మాజీ ఉప సర్పంచ్ గడ్డం సుభాష్

**ప్రజాపక్షం/ముధోల్ :** ప్రజా సేవే తన లక్ష్యమని, భారీ వర్షాల వేళ ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నానని ముధోల్ మాజీ ఉప సర్పంచ్ గడ్డం సుభాష్ తెలిపారు.అత్యవసర సమయాల్లో స్థానికులకు ఉచిత వాహన సేవలు అందిస్తానని ప్రకటించారు. రవాణా సౌకర్యాలు లేక ఇబ్బంది పడేవారు ఆందోళన చెందవద్దని, మానవత్వమే మహోన్నతమైన సేవ అనే భావనతో అండగా ఉంటానని చెప్పారు. ఏ సమయమైనా ప్రజలు సంకోచించకుండా తనను సంప్రదించి, ఉచిత వాహన సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దు

**ప్రజా పక్షం/పెంబి :** మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో పెంబి ఎస్ఐ హనుమాన్లు మాట్లాడుతూ మత్తు పదార్థాలను సేవించడం వలన కలిగే అనర్థాలు గురించి మాట్లాడుతూ మత్తుపదార్థాలకు అలవాటు పడిన వారి మెదడు పనితీరును ఆలోచన శక్తిని మార్పి వేసి వాటికి శరీరాన్ని బానిసగా చేసుకునే ప్రమాదకరమైన వస్తువులు.వీటిలో ముఖ్యంగా గంజాయి హెరాయిన్,సారా ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ హెచ్చరించారు.అలాగే మత్తు పదార్థాలకు వలన యువత గాని ఇతర కుటుంబ యజమానులు గాని ఎందరో తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు కాబట్టి సౌ ధ్యమైనంతవరకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ హెచ్చరించారు.

# నిర్మల్ పట్టణంలో వర్షపు నీటి సమస్యలకు పరిష్కారం

### రంగంలోకి దిగిన మున్సిపల్ యంత్రాంగం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పట్టణ పరిధిలోని వివిధ వార్డుల్లో నిలిచిన వర్షపు నీటి సమస్యలపై మున్సిపల్ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో సమస్యలను తక్షణమే పరిష్కరిస్తోంది. పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని సోఫీనగర్ ప్రాంతంలో నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించారు. వర్షపు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన 15 పైపులను తొలగించారు. దీంతో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా మార్గం సుగమమై, స్థానిక కాలనీవాసులకు పెద్ద ఉపశమనం లభించింది. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఆర్షియా తబస్సుమ్ (తాహిర్ పటేల్), మున్సిపల్ డిఈ హరిభువన్, కాలనీవాసులు




అక్బర్ ఖాన్, అబ్దుల్ నిజాం, అఫ్సాన్ షా మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా 1వ వార్డు పరిధిలోని ఆర్ఆర్ గార్డెన్ సమీపంలో గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలో నీళ్లు నిండిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ కత్తి నరేందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది జెసిబి సహాయంతో కచ్చా డ్రైనేజీని తవ్వి పూడికను క్లియర్ చేశారు. నిలిచిన నీరు వేగంగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టడంతో కాలనీవాసులకు నీటి తిప్పలు తప్పాయి. ప్రజలారా... వర్షాకాలంలో జర భద్రం! భారీ వర్షాలు కొనసాగుతున్నందున పట్టణ ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల నివాసితులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ముంపు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసిన ఆప్ నేతలు



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** భారీ వర్షాల నేపథ్యంలో నిర్మల్ పట్టణ పరిధిలోని గాయత్రిపురం, సిద్ధాపూర్ మరియు జీఎన్ ఆర్ నగర్ తదితర ముంపు ప్రాంతాలలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి సయ్యద్ హైదర్ పర్యటించి, వరద పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను అప్రమత్తంగా ఉండాలని సూచించడంతో పాటు, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.గత కొన్ని సంవత్సరాలుగా వర్షాకాలంలో గాయత్రిపురం, సిద్ధాపూర్, జీఎన్ ఆర్ నగర్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ప్రతిసారీ వర్షాలు పడగానే ముంపు సమస్య ఎదురవుతున్నందున అధికారులు తక్షణమే స్పందించి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గాయత్రిపురంతో పాటు పరిసర ముంపు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిర్మల్ తహశీల్దార్ ప్రభాకర్ స్వయంగా క్షేత్రస్థాయిలో విజిట్ చేసి స్థానిక పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల తరపున అధికారులకు సయ్యద్ హైదర్ ఒక కీలక సూచన చేశారు. వర్షపు నీరు వేగంగా, సులువుగా బయటకు వెళ్లేందుకు ఆయా ప్రాంతాల్లో 20 నుండి 30 అడుగుల విస్తీర్ణంతో కూడిన బ్రిడ్జిలు (కల్వర్టులు) నిర్మిస్తే ఈ నీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రేషన్ ఇ కెవైసి గడువు పొడిగించాలి

### లబ్ధిదారుల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో రేషన్ కార్డుల ఇ కెవైసి ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం విధించిన గడువు సరిపోవడం లేదని, గడువును మరికొంత కాలం పొడిగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. జిల్లాలోని పలు రేషన్ దుకాణాలు, మీసేవ కేంద్రాల్లో సర్వర్ సమస్యలు,బయోమెట్రిక్ సరిగ్గా పడకపోవడం, ఆధార్ వివరాల్లో తేడాలు ఉండటం మరియు కేంద్రాల వద్ద రద్దీ ఎక్కువ కావడంతో చాలామంది ఇ కెవైసి పూర్తి చేయలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు మరియు దూర ప్రాంత గ్రామాల నుంచి వచ్చే ప్రజలు పలుమార్లు కేంద్రాల చుట్టూ తిరిగినా సాంకేతిక లోపాల వల్ల ఖాళీ చేతులతో వెనుతిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. సమయానికి ఇ కెవైసి కాకపోతే అర్హులైనప్పటికీ రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోవాల్సి వస్తుందని భయాందోళన చెందుతున్నారు.ఈ సమస్యలను అధిగమించేందుకు జిల్లాలో ప్రత్యేక ఇ కెవైసి శిబిరాలు నిర్వహించాలని, సర్వర్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రక్రియ పూర్తి చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాధిత గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** బల్లివాగులో గల్లంతయ్యి మృతి చెందిన మర్సుకోల పారుబాయి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ పంచాయతీ పరిధిలోని చామన్ పల్లి గోందుగూడెనికి చెందిన మర్సుకోల పారుబాయి (47) భర్త మర్సుకోల మధుకు సంబంధించిన పింఛను కోసం భర్తతో కలిసి పంచాయతీ కార్యాలయానికి వచ్చి తిరిగి వెళ్లేటపుడు బల్లివాగు వరద ఉధృతికి గల్లంతయ్యి మృతి చెందగా గురువారం మృతురాలి కుటుంబాన్ని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య పరామర్శించారు.ఆయన మాట్లాడుతూ గ్రామంలోని బల్లివాగుపై ప్రభుత్వం వంతెనను మంజూరు చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు.గిరిజన గ్రామాలకు వంతెనలు లేకనే ప్రతీ యేటా గిరిజనులు మృత్యువాత పడుతున్నారన్నారు.గతంలో కుసుంపూర్ కి చెందిన గిరిజన యువకుడు బల్లివాగు దాటే క్రమంలో కొట్టుకుపోయి మృతి చెందాడని,మృతురాలు పారుబాయి మృతితోనైనా ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. మృతి చెందిన పారుబాయి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకొని గిరిజన కుటుంబానికి 5 లక్షల ఎక్స్ గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు.కొలాంగూడ సర్పంచ్ అర్జున్,ఎర్వచింతల్ మాజీ సర్పంచ్ గోపాల్,బిఆర్ఎస్ నాయకులు వంశీ,రాజు తదితరులున్నారు.

## పెంబి మండలంలో వర్షానికి జనజీవనం అతలాకుతలం

**ప్రజాపక్షం/పెంబి :** పెంబి మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం ఏకాదాటిగా కురుస్తుండడంతో ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు విపరీతంగా రావడంతో కడెం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే చికమన్ జుత్తివాగు పల్కేరు వాగుల ప్రభావం వలన కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో నది పరివాక ప్రాంతమైన యాపల గూడా,రాంనగర్ సతుగూడ లో పంట చేన్లు నీట మునిగిపోయాయి ఆయా గిరిజన గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో నిత్య అవసరాల కోసం బయటకు రాలేని పరిస్థితి నెలకొన్నది.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం

సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్

**ప్రజాపక్షం/ముధోల్ :** భారీ వర్షాల నేపథ్యంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని మండలంలోని అష్టా గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ అన్నారు.గురువారం ఉదయం నుండి కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామంలో ఎక్కడ నీరు నిలువకుండా ప్రతి వార్డును పర్యవేక్షించి పంచాయతీ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన విధులు చేపడుతున్నామని పేర్కొన్నారు.అంతే కాకుండా రాత్రి సమయాల్లో గ్రామానికి వచ్చేవారికి ఇబ్బందులు కలుగకుండా గ్రామంలో ప్రతి చోట వెలుగు ఉండేలా విద్యుత్ బల్బులను సైతం అమర్చడం జరిగిందని తెలిపారు.ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తమను సంప్రదించాలని సహాయక చర్యలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు.ఈ కార్యక్రమం లో స్థానిక సెక్రెటరీ గాడేకర్ గంగాధర్, వార్డు సభ్యులు,పారిశుధ్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల బీభత్సం.. రోడ్డుపై కూలిన చెట్టు



**ప్రజాపక్షం/భైంసా :** జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భైంసా డివిజన్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. భైంసా మండలం మహాగాం–గుండెగాం గ్రామాల మధ్య భారీ వృక్షం రోడ్డుపై కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కుబీర్ మండలం పార్డి (బి)గ్రామానికి వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.రోడ్డుపై పడిన వృక్షాన్ని గమనించిన మహాగాం గ్రామ లైన్‌మన్ శేఖర్ స్వచ్ఛందంగా చెట్టు కట్టింగ్ మిషన్ తీసుకొచ్చి వృక్షాన్ని తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు.సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని నేలకొరిగిన విద్యుత్ స్తంభాల మరమ్మతులు చేపట్టి,విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారు.స్థానికులు లైన్‌మన్ శేఖర్ సేవలను అభినందించారు.

## పౌర హక్కులపై అవగాహన అవసరం: తహసీల్దార్

**–ప్రజాపక్షం /కుంటాల :** పౌరహక్కులపై ప్రతి ఒకరు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కమల్ సింగ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంకూర్ గ్రామపంచాయతీ లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు ఎలాంటి భంగం కలిగినా చట్టపరమైన చర్యలుంటాయన్నారు. భంగం కలిగించినవారు ఎవరైనా సరే శిక్షార్హులవుతారన్నారు. కులవివక్ష, అంటరానితనం, వృద్ధులు, మైనార్టీ, దళిత, వెనుకబడిన, సమాన ఉపాధి హామీ తదితర హక్కుల గురించి వివరించారు.కులమతాలకు అతీతంగా అందరు కలిసి ఉండాలని సూచించారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి రాజ్యాం గం హక్కులు కల్పించిందన్నారు. వీటిని అన్నివర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింధే సవిత,ఉపసర్పంచ్ అశోక్,ఆర్ ఐ రాజేశ్వర్,జీపీఓ భోజన్న,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని అడవి మామిడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కర్క గంగారెడ్డి అనారోగ్యం కారణంగా మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ తరిగొప్పులా చిరంజీవి 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లత సాగర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు లింగారెడ్డి, వార్డు సభ్యులు భోజేందర్ పాల్గొన్నారు.

## బాబురావు జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** మోర్తాడ్ మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మోర్తాడ్ ఆధ్వర్యంలో గురువారం పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జి.బాబురావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకొని మోర్తాడ్ బస్టాండ్ ఆవరణలో అన్నదానం చేశారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పర్స దేవన్న, సెక్రెటరీ కస్ప లక్ష్మీ నర్సయ్య, ట్రెజరర్ తీగెల రమేష్, డిస్ట్రిక్ట్ ఛైర్ పర్సన్ మామిడాల మనోహర్, ప్రోగ్రాం ఛైర్ పర్సన్ కొప్పుల రాజ శేఖర్, సర్పంచ్ ల యన్ భోగ ఆనంద్, ఉప సర్పంచ్ సామ శ్రీనివాస్, ముస్కు రమేష్, పుప్పాల అశోక్, వాంకారి శ్రీనివాస్, జైడి చిన్న గంగారాం తదితర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు పునరావాసం



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు గ్రామ పంచాయతీ పాలకవర్గం తక్షణ సహాయం అందించింది. ఠాణాకలాన్ గ్రామానికి చెందిన షేక్ వహీదా, మెట్టు సుజాత, ఊరోల్ల లలిత అనే ముగ్గురు బాధితుల ఇళ్లు వర్షాల ధాటికి దెబ్బతినడంతో ముందస్తు జాగ్రత్త చర్యగా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ముగ్గురికి ఇప్పటికే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మం జూరై ఉండటంతో వారికి కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి షిఫ్ట్ చేశారు. అదేవిధంగా గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న చెవుల గౌరవ్వ అనే వృద్ధురాలి భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆమెను కొడుకు ఇంటికి సురక్షితంగా పంపించారు. వర్షాల వల్ల ఎ లాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా స్పందించి సహాయ చర్యలు చేపట్టిన గ్రామ పా లకవర్గాన్ని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అలేఖ్య, పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఉప సర్పంచ్ రవి, గ్రామ నాయకులు దేవేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### ప్రత్యేక అధికారి బాలేగ్ హైమద్




**ప్రజాపక్షం/సారంగాపూర్ :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా మండలంలోని అధికారులు ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి బాలేగ్ హైమద్ పేర్కొన్నారు.గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీ కాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ మత్స్యకారులు,పశువుల కాపరులు వాగుల వైపు వెళ్లకూడదని సూచనలు జారీ చేశారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ 9100577132 ఏర్పాటు చేయడం జరిగిందని అత్యవసర పరిస్థితుల్లో ఈ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖ అధికారులు అభివృద్ధి పనులను వివరిస్తూ అలాగే మరమ్మతుల్లో ఉన్న పనులను ప్రస్తావించారు. హాజరైనటువంటి ఆయా గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తమ గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రాగా త్వరలోనే ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, ఆలూరు పీఏసీఎస్ చైర్మన్ మాణిక్ రెడ్డి, ఎంపిఒ అజీజ్ ఖాన్, ఏవో వికార్ హైమద్,ఎంఈఓ మహేందర్,వెటర్నరీ అధికారి నందకుమార్, తదితర సంబంధిత శాఖ అధికారులు, సర్పంచులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలి



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఓ అరుణ అధ్యక్షతన ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి రాథోడ్ రమేష్ హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. విద్యాశాఖ ప్రగతిపై సమీక్షిస్తూ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల హాజరు శాతంలో మండలంలోని 10 పాఠశాలలు జిల్లాలోనే మొదటి స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు మధ్యాహ్న భోజన నాణ్యతను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, 1 నుండి 5 వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం బోధనను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వైద్యారోగ్య రంగంలో మండలం విశేష ప్రగతి సాధించిందని, పల్స్ పోలియోతో పాటు హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో జిల్లాలోనే 2వ స్థానంలో నిలిచిందని సమీక్షలో వెల్లడించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే పాటించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని నిర్ణయించారు.. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, నదీ పరివాహక ప్రాంతాల ప్రజల రక్షణ కోసం ముందస్తు జాగ్రత్త చర్యలపై శుక్రవారం మరో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సిఎస్‌సి టాయిలెట్ల నిర్మాణాన్ని ప్రతి పాదించారు. ఈ సమీక్షా సమావేశంలో తహసీల్దార్ షేక్ అజాజ్ ఖాన్, ఎంఈఓ పి. సదానందన్, ఏపీఓ రామణ, ఎంపీఓ గోవర్ధన్, పిఏసిఎస్ చైర్మన్ పి.వి. రమణారెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి శివ, ఇరిగేషన్ అధికారి గంగాధర్, ఆర్డబ్ల్యూఎస్ / రీఛార్జ్ ప్లాన్ అధికారి రాజశేఖర్, అంగన్‌వాడీ సూపర్వైజర్లతో పాటు వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచులు పాల్గొన్నారు.

# వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సంతోష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్‌కుమార్ గ్రామస్థాయి అధికారులకు ప్రజాప్రతినిధులకు జూమ్ కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించి అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న పూరి గుడిసెలు, కూనా పెంకుల ఇళ్లు, స్లాబ్ ఇళ్లు ఉన్న వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. చేపల వేటకు నదులు, కాలువలు, చెరువులకు వెళ్లకుండా చూడాలని, వాగులు, వంకలు వరద ప్రాంతాలలు సెల్ఫీలు రీల్ కోసం వెళ్లకుండా తగు జాగ్రత్తలు ఏర్పాటు తీసుకోవాలన్నారు. లోతట్టు కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద వరద తాకిడి ఎక్కువగా ఉంటున్నందున వాగులు, వంతెనలు దాటకూడదన్నారు. చెరువులు, తూములు, అలుగులు, బుంగల పట్ల నీటిపారుదల శాఖ అధికారులు జాగ్రత్తగా ఉండి అవసరమైన చోట ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఏఈలు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, ఎపిఓ, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, జీపీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, కారోబార్లు పాల్గొన్నారు.

# చిక్లీ గ్రామంలో జలసిరిపై అవగాహన



**ప్రజాపక్షం/మాక్లూర్ :** మండలంలోని చిక్లీ గ్రామంలో ఉపసర్పంచ్ బూరోల్ల సతీష్ అధ్యక్షతన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలసిరిలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి అనిల్ హాజరై మాట్లాడారు. జలసిరిగిపై గ్రామస్తులపై అవగాహన కల్పించాలని, భూగర్భజలాలు అడుగంటిన సందర్భంలో గ్రామంలోని ప్రతిఒక్కరూ నీటిని ఆదా చేయాలని ఇంకుడు గుంతలను చేసుకుని మురికినీటిని తద్వారా తరలించాలని ఇంకుడు గుంతల నిర్మాణం, ఊర కుంటల, పునరుద్ధరణ, పంట కుంటల ఏర్పాటుపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు మహిళా సమాఖ్య అధ్యక్షుల సభ్యులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలన్నారు. భూగర్భజలాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని, నీటి సంరక్షణే ధ్యేయంగా బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సతీష్, వార్డు మెంబర్ శ్రీకాంత్, గంగాధర్, నవీన్, రాజు, పంచాయతీ కార్యదర్శి నవీన్, కారోబార్ సాయిలు, అంగన్‌వాడీ సిబ్బంది సమంతా, సుభాషిని, ఆశావర్కర్లు సువర్ణ, మంజుల, సిఎ జలజ, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మీ కబీరా, మహిళలు పాల్గొన్నారు.

## కెజిబివిలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం /కుంటాల :** మండలంలోని కల్లూరు కేజీబీవి పాఠశాలలో అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీకి మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ వాటోలి ముత్యం ఒక ప్రకటనలో తెలిపారు.పదో తరగతి చదివిన వారై,18 సంవత్సరాలు నిండిన ఓ సి మహిళ అర్హులని, ఆగస్టు 10వ తేదీవరకు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** భారీ వర్షాల నేపథ్యంలో లోకేశ్వరం మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సూర్యరావు తెలిపారు నిన్నటి రోజున నుండి ఈరోజు వరకు 95 మి. మీ వర్షపాతం నమోదయిందని సూచనలు పాటించాలని వాగులు వంకలు కాలువలు చెక్ డ్యాములు తక్కువ ఎత్తులో ఉన్న రహదారు కేజీవిల్ మరియు ఎస్‌ఆర్‌ఎస్‌పి బ్యాక్ వాటర్ ప్రాంతాలకు ఎట్టి పరిస్థితిలోనూ వెళ్లరాదని నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని వరద నీరు ప్రవహిస్తున్న రహదారులు వాగులు లేదా కేజ్వెల్ దాటేందుకు ఎట్టి పరిస్థితిలో వెళ్లకూడదని అలాగే శిథిలావస్థలో ఉన్న లేదా కూలిపోయే పరిస్థితిలో ఉన్న అలాంటి ఇంటిలో ఉండకూడదని సురక్షిత ప్రాంతంలో ఉండాలని తెలిపారు.పిల్లలు చెరువుల వద్ద వాగుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలని రైతులు మరియు పశుపోషకులు మరియు మత్సకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అత్యవసర పరిస్థితుల్లో రెవెన్యూ పోలీసు పంచాయతీరాజ్ మరియు ఇతర శాఖలకు అధికారులు ఇచ్చే సూచనలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితిలో గ్రామ పాలన అధికారి జిపిఓ గ్రామపంచాయతీ పోలీస్ స్టేషన్ మండలాధికారులకు సమాచారం అందివ్వాలని తెలిపారు.మండల ప్రజలు అప్రమత్తంగా ఉండి అనవసరం లేని ప్రయాణాలు చేయకుండా మానుకోవాలని తెలిపారు.

## ఊర పండగ కోసం బండారు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 2న జరగనున్న ఊర పండగను పురస్కరించుకుని శుభసూచకంగా గురువారం సర్వసమాజ్ కమిటీ శ్రీ విజయ్ కిసాన్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పసుపు, కుంకు పూలతో బండారు పోయటం జరిగిందని కల్లు సాకలు సమర్పించామని సర్వసమాజ్ కమిటీ కన్వీనర్ రామర్తి గంగాధర్, కోకన్వీనర్ ఆదే ప్రవీన్ తెలిపారు. ఈ సందర్భంగా దున్నపోతునూ ఊరి మీదకు విడవటం జరిగిందని, ఈ రోజు నుంచి గ్రామదేవతలా విగ్రహాలు తయారీ, ఊర పండగ కోసం ఏర్పాట్లు షురూ అయ్యాయని, అనాదిగా వస్తున్న ఆచారం మా పెద్దలతో ఆనవాయితీగా వస్తున్న ఊర పండగతో మన గ్రామదేవతల ఊరేగింపులో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని గ్రామ దేవతల తల్లుల ఆశీర్వాదం తీసుకోవాలన్నారు. ఈ ఊర పండగతో పాడిపంటలు, పశుసంపద వృద్ధి చెందాలని, పిల్లల పెద్దలు ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజలందరికి అష్ట ఐశ్వర్యాలను కలిగి దృష్టశక్తులు దరి చేరకుండా ఉండాలని సర్వసమాజ్ కమిటీ సభ్యులు మొక్కుకున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీ విజయ్ కిసాన్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు కోరడి కిరణ్, ఉపాధ్యక్షులు అండ్ కార్పొరేటర్ మల్కాయి మహేందర్, మాజీ కార్పొరేటర్ రామడ్గు బాలకిషన్, సెక్రటరీ ధామ ఇంద్రకరణ్, పెద్దకాపులు మల్కాయి లక్ష్మీనారాయణ, గంట పెద్దనర్సయ్య, స్వామి, లింబాద్రి, స్వామి కొరడి చిన్ననర్సయ్య, కొర్వ భూపాల్, పెద్దమనుషులు, సుంకెటి ప్రవీన్, మల్కాయి భోజన్న, జాన్కంపేట్ అశోక్, మల్కాయి సుదర్శన్, పసుల రాజు పాల్గొన్నారు.

## రైల్వే బ్రిడ్జి నంబర్ 234ఎ పై నుంచి కారుతున్న వర్షపు నీరు

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి):** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో సిర్పూర్ (టి) మండలం చీలపల్లి వెళ్లే రైల్వే బ్రిడ్జి నం. 234ఎ పై నుంచి వర్షపు నీరు ఉధృతంగా కిందకు కారుతోంది. దీంతో బ్రిడ్జి కింద ఉన్న అండర్‌పాస్ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి ప్రవాహం కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగించే ఈ మార్గంలో నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, శాశ్వత చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులను స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వాహనదారులు పాల్గొన్నారు.

# కడెం ప్రాజెక్టుకు విపరీతంగా పెరుగుతున్న వరద

**ప్రజాపక్షం/నిర్మల్ /ఖానాపూర్ :** నిర్మల్ జిల్లావ్యాప్తంగా గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాల కారణంతో కడెం నారాయణ రెడ్డి ప్రాజెక్టుకు వరద ఉధృతి ప్రమాదకర స్థాయిలో పెరుగుతోంది. ఎగువన ఉన్న క్యాచ్‌మెంట్ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు నీటి మట్టం వేగంగా గరిష్ట స్థాయికి చేరుకుంటోంది. పరిస్థితి తీవ్రతను గమనించిన నీటిపారుదల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ గేట్ల సంఖ్యను పెంచి నీటిని దిగువ గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు అధికారులు విడుదల చేసిన అత్యవసర సమాచారం ప్రకారం గురువారం మధ్యాహ్నం 12:15 గంటల సమయానికి కడెం ప్రాజెక్టు మొత్తం 18 గేట్లలో 11 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో భాగంగా 13వ నంబర్ గేటును 7 అడుగుల మేర, 17వ నంబర్ గేటును 10 అడుగుల మేర పైకెత్తారు. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 694.400 అడుగులకు చేరింది. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా పెరగడంతో ప్రస్తుతం 89,999 క్యూసెక్కుల సర్ఫస్ నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. కడెం వద్ద వరద పరిస్థితి తీవ్రమవుతున్న నేపథ్యంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి



షర్మిల, అడిషనల్ కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించారు. గేట్ల వద్ద నీటి విడుదల తీరును, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను కడెం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలు,లోతట్టు గ్రామాల భద్రత, ప్రజల రాకపోకలు, పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున పరివాహక ప్రాంతాల ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున ప్రాజెక్టుల వద్దకు, వాగులు, వంకలు, చెరువుల వద్దకు ప్రజలు ఎవరూ వెళ్లకూడదని స్పష్టం చేశారు. నీటి ప్రవాహాల వద్ద నిలబడి సెల్ఫీలు దిగడం, రీల్స్ తీయడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు.గొర్రెలు, పశువుల కాపరులు, మత్స్యకారులు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహించే వాగులు, కాలువలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ సాహసించవద్దని తెలిపారు. పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు మారాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఆపత్కాలంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని, అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ తనిఖీ మరియు సమీక్షా కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్,కడెం మండల తహసీల్దార్, ఎంపీడీవో,విద్యుత్ శాఖ ఏఈ,నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ,వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు గాంధీనగర్ లో స్థానిక వార్డ్ కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైద్య యంత్రాంగం తరుపున ఉచిత చెస్ట్, శ్వాస కోస వ్యాధుల సంబంధిత వైద్య పరీక్షలు చేశారు. దగ్గు, దమ్ము, శ్వాస సంబంధిత వ్యాధుల నిర్ధారణ కొరకు డిజిటల్ చెస్ట్ ఎక్స్–రే ఉచితంగా నిర్వహించారు. ఇలాంటి వైద్య శిబిరాలను సిరిసిల్ల ప్రజలు విని యోగించుకోవాలని స్థానిక వార్డు కౌన్సిలర్ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ పూర్ణచందర్,18 వ వార్డు కౌన్సిలర్ మేర్గు మంజుల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, రేడియోగ్రాఫర్ బాలు, సూపర్ వైసర్ సంతోష్, ఏఎన్ఎం అన్నపూర్ణ, ఆశ వర్కర్ శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర వేళ రక్తదానం



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని కేశవ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గొర్రపల్లి గ్రామానికి చెందిన లతకు అత్యవసర చికిత్స కోసం ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. వైద్యులు వెంటనే రక్తం అవసరమని సూచించడంతో కుటుంబ సభ్యులు రక్తదాతల అనుసంధానకర్త ఉదయ్ కుమార్‌ను ఆ శ్ర యించారు. సమాచారం అందుకున్న కాప్రీ గోల్డ్ లోన్ సీనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఏశాల వెంకటేష్ వెంటనే స్పందించారు. కార్యాలయం నుంచి నేరుగా బ్లడ్ బ్యాంక్‌కు చేరుకుని రక్తదానం చేసి మానవత్వాన్ని చాటు కున్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పం దించిన వెంకటేష్ సేవలను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతల అనుసంధానకర్త ఉ దయ్ కుమార్, కాప్రీ గోల్డ్ లోన్ మేనేజర్ శేఖర్, యువజన సంఘాల సభ్యులు, రోగి కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినం దించారు.

## పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం నియోజకవర్గంలో ఎడాపెడా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నిరుపేదల ఇళ్లు, గోడలు కూలి నిరాశ్రయులైన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రామగుండం నగర సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం, శనిగరపు చంద్ర శేఖర్ లు డిమాండ్ చేశారు.ప్రభుత్వాధికారులకు రామగుండం నియోజక వర్గంలో వర్షాలకు ఇండ్లు కోల్పోయినా వారికి ఉచితంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని,నిరాశ్రయులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయంగా రూ. 50,000 ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో నష్ట



పోయిన బాధితులను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ నగర సమితి తరపున ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము. లేనియెడల బాధితుల తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి రామగుండం నగర సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ కరీం, చంద్ర శేఖర్ లు హెచ్చరించారు.

## జాతీయ రహదారి నిర్మాణంతో మునుగుతున్న పంట పొలాలు



**ప్రజాపక్షం/ముత్తారం :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో జాతీయ రహదారి నిర్మాణం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పనుల వల్ల నీరు నిలిచిపోవడంతో పోతారం శివారులోని పైభాగంలో ఉన్న పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి.ఈ విషయం తెలుసుకున్న పోతారం సర్పంచ్ ఊట్ల చరణ్, ఉప సర్పంచ్ తుడూరి శారద నరేందర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వెంటనే జెసిబి సహాయంతో రోడ్డును తవ్వించి నిలిచిన నీటిని పారుపల్లి చెరువుకు మళ్లించేలా తాత్కాలిక పనులు చేపట్టారు.దీనితో రైతులకు కొంత ఉపశమనం లభించింది. భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వర్షపు నీరు సులువుగా వెళ్లేందుకు శాశ్వత ప్రాతిపదికన కల్వర్టులు నిర్మించాలని ఈ సందర్భంగా వారు కాంట్రాక్టర్‌ను కోరారు. లక్కారంలో 10 ఎకరాల్లో పంట నష్టం : మరోవైపు లక్కారం గ్రామంలో కూడా జాతీయ రహదారి నిర్మాణం వల్ల పంట పొలాలు జలమయమయ్యాయి. నీరు బయటకు వెళ్లే దారి లేకపోవడంతో దాదాపు పది ఎకరాల పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయని లక్కారం సర్పంచ్ అత్తె చంద్రమౌళి ఆవేదన వ్యక్తం చేశారు.రోడ్డు నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం వల్లే రైతులకు ఈ నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులకు వెంటనే ప్రభుత్వం, కాంట్రాక్టర్లు తగిన నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశా రు.

## చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న చిల్డ్రన్స్ హోమ్‌ను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత గురువారం సందర్శించారు.ఇటీవల చిల్డ్రన్స్ హోమ్ నుంచి ఇద్దరు బాలికలు పారిపోయిన ఘటనపై అక్కడి ఇన్‌చార్జ్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.పారిపోయిన ఇద్దరు బాలికలను నల్లగొండ జిల్లాలో పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా చిల్డ్రన్స్ హోమ్‌లో పిల్లలకు అందిస్తున్న ఆహారం నాణ్యత, మెనూను పరిశీలించిన పుష్పలత,ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.బాల బాలికల ఆరోగ్యం,విద్య, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.అదేవిధంగా,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పిల్లల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, వారి సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ చింతల రాజు,మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బైకు దొంగ అరెస్ట్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బైక్లను దొంగతనం చేస్తూ తొమ్మిది కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని పెద్దపల్లి ఎస్సై కె. నరేష్ ఆధ్వర్యంలో చాకచక్యంగా పట్టుకొని రిమాండ్ చేసినట్లు పెద్దపల్లి సిఐ కె. ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం రోజున పెద్దపల్లి పోలీస్ స్టేషన్లో నిందితుడి అరెస్టు సందర్భంగా సిఐకే ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన ప్రదీప్ అనే వ్యక్తి స్థానిక బస్టాండ్ వద్ద ఫార్మసి ముందు తన బైక్ ను పార్కింగ్ చేసి తన సొంత పని నిమిత్తం మంథని కి వెళ్ళగా వచ్చి చూసేసరికి తన బైకు కనబడటం లేదని పెద్దపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పెద్దపల్లి ఎస్సై కే నరేష్ కేసు నమోదు చేసి సీసీటీవీ ఫుటేజ్ ల ఆధారంగా నిందితుడు రంగు గంగాధర్ ను బుధవారం సాయంత్రం అరెస్టు చేశామని తెలిపారు.ఈ కేసును చాకచక్యంగా చేదించిన ఎస్ఐ కే నరేష్, కానిస్టేబుల్స్ ప్రభాకర్, సతీష్ లను సిఐ అభినందించారు.

## బస్టాండ్‌ను ఆధునీకరించాలని మంత్రికి వినతి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేటః** బస్టాండ్‌ను ఆధునీకరించాలని, ప్లాట్‌ఫాం తక్కువ ఎత్తులో ఉందని,నీరు నిల్వ ఎక్కువగా ఉంటుందని రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వినతి పత్రాన్ని సిరిసిల్లా,వేములవాడ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగగిరిధర్‌రెడ్డి ఆయన ఎల్లారెడ్డిపేట మండల బస్టాండ్ ను వెనుకకు జరిపించి బస్సులు ఆగేవిధంగా ప్రయాణికుల సౌకర్యం కల్పించే విధంగా చేయాలని కోరారు. అందుకు కావలసిన బడ్జెట్ కేటాయించాలని వినతిపత్రంలో కోరారు.తక్షణమే నిధులు మంజూరు చేయాలని వంగగిరిధర్‌రెడ్డి మంత్రితో విన్నవించుకున్నారు.

## శ్రీ రామలింగేశ్వర ఆలయ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** వాల్గొండ శ్రీ రామలింగేశ్వర ఆలయ కమిటీ సమావేశాన్ని వాల్గొండ సర్పంచ్ తోపారపు వసంత, వాల్గొండా తండా సర్పంచ్ ధరం సోత్ సురేందర్ ఆధ్వర్యంలో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ మేరకు ఆలయ కమిటీ అధ్యక్షునిగా సాంబారి శంకర్,ఉపాధ్యక్షురాలుగా చిలివేరి లక్ష్మి ,కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్న సర్పంచ్లకు గ్రామస్తులకు ప్రజాప్రతినిధులకు నూతన ఎన్నికైన అధ్యక్షులు శంకర్, ఉపాధ్యక్షులు చిలివేరి లక్ష్మి ,ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు క్యాతమ్ నరేష్ రెడ్డి, శాఖ ప్రభు కిరణ్, చొప్పరి వెంకటేష్, రఫీ, వీరేశం,సంతోష్ రెడ్డి అశోక్, బాలరాజు,గంగారం,శేఖర్,తదితరులు ఉన్నారు.

## నల్మాసు ప్రభాకర్‌కు సన్మానం

**ప్రజాపక్షం/రామగిరి :** లలిత కళాసమాఖ్య ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని "సేవ వైభవ రత్న" అవార్డుతో పాటు సువర్ణ కంకణం, బంగారు పతకం అందుకోనున్న సందర్భంగా, పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నల్మాసు ప్రభాకర్ ని పెద్దపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముస్త్యాల శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ముస్త్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ, సామాజిక సేవా రంగంలో నల్మాసు ప్రభాకర్ చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక "సేవ వైభవ రత్న" అవార్డు, సువర్ణ కంకణం, బంగారు పతకం లభించడం జిల్లా ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య పటేల్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బుద్దార్థి బుచ్చయ్య పటేల్, ప్రజా నాయకుడు బర్ల. శ్రీనివాస్, రామగిరి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అవినాష్ గౌడ్ రావికంటి సతీష్ గుప్త తదితరులు పాల్గొని నల్మాసు ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం /రాయికల్ :** రాయికల్ మున్సిపాలిటీలో ప్లంబర్ పనిచేసే కార్మికుడు భీమయ్య గురువారం అనారోగ్యం తో మృతిచెందగా చైర్మన్ కటకం రవిందర్ ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. మున్సిపల్ తరుపున అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట కౌన్సిలర్లు గంగాధర్, రాకేష్ నాయక్, నాయకులు తురగ శ్రీధర్, కూనరాపు భూమేష్, మచ్చ శేఖర్, నాగరాజు, రాము, అనిల్ , తదితరులు ఉన్నారు.